# నమ్మకం




'రామశేషు'

బస్సు సౌకర్యం తప్ప మరేదీ లేని ఆ చిన్న పల్లెటూళ్ళో హైస్కూలుండటం, అందులో పది పన్నెండు మంది మాష్టర్లుండటం విశేషం కిందే లెక్క. వాళ్ళలో ఒకడైన రామారావుకి స్నేహశీలీ మితభాషీ, సౌమ్యుడూ అన్న పేరుంది.

ఒకనాడుదయం నిద్రలేస్తూనే యింటావిడ వాటాలోంచి ఎవరో గలగలా మాట్లాడటం వినిపించింది రామారావుకి. వెంటనే ఆ కంఠం ఎవరిదో పోల్చుకున్నాడు. తనలో తాను సన్నగా నవ్వుతున్నాడు. ఇహ యివాళ్ళంతా కావల్సినంత సందడి అనుకున్నాడు

ముందుగదిలో కూచుని పేపరు చదువుకుంటూవుంటే "ఏంచేస్తున్నావు నాయనా! అంతా కులాసాయేనా! అమ్మాయి లోపల పనిచేసుకుంటూవుందా" అంటూ యిందాక గలగలామాట్లాడినావిడ వచ్చి రామారావుని పలకరించింది. ఆవిడ్ని రంగమ్మగారంటారు వయస్సు సుమారు యాభైయ్యైదు మధ్యవుంటుంది. స్థూలకాయం మనిషి పొడగరి. నలుపుకిందే లెక్క.

రామారావు ఆవిడవేపు ఆప్యాయంగా చూసి "ఏదో మీలాంటి పెద్దల ఆశీర్వాదంవల్ల కులాసాగానే వున్నాం" అన్నాడు.

ఇంతలో అతడి భార్య సరోజ బయటికొచ్చి "ఓ" మీరా బామ్మగారూ! ఎవరో అనుకున్నాను ఎంతసేపైందివచ్చి" అంటూ పలకరించింది.

"ఆ! ఎంతసేపోనా! ఓగంట అయివుంటుందేమో" అంది ఆవిడ "కాస్తలో కాశీరామాయణం ముచ్చటించుకున్నాక" వుంటారా రెండురోజులు" అంది సరోజ.

"లేదే అమ్మాయి. ఇప్పుడే పేటకి వెడుతున్నాను. ఆఁ! అన్నట్టు వచ్చిన పని మరిచిపోయాను. చూడు నాయనా' ఓ పాతికరూపాయలుంటే యివ్వు. తిరిగి వచ్చేటప్పుడు యిచ్చేస్తాను. ఆ పల్లెటూళ్లో వందరూపా

యల నో టేమో మారిచావదుగదా'' అంటూ సరోజ నవ్వుతూనే చురక అంటించింది.

'అదేమిటే మనవరాలా! అలా అంటావు? మీ డబ్బు యివ్వకుండా పారిపోతానను కున్నావా? అక్కడ రైతులిచ్చే డబ్బులోంచి యిచ్చేస్తాను. ఏదో ముందు జాగ్రత్తకోసం అడిగానుగానీ నాదగ్గరలేకనా!'' అంటూ ఆవిడకూడా నవ్వుతూనే తిప్పికొట్టింది.

'అబ్బేసరదాకన్నానండీ'' అని సరోజా.

''ఇందులో నువ్వుమాత్రం అన్నది ఏముం దిలే'' అని రంగమ్మగారూ, ఇద్దరూ సర్దు కున్నారు.

అప్పటిదాకా రామారావు ఏమీ అనలేదు. ఇహవూరుకుంటే బాగుండదని ''అలాగే యిస్తాను తీసికెళ్ళండి బామ్మగారూ! మీకి చ్చిన డబ్బు ఎక్కడికిపోతుంది'' అంటూ డబ్బు తేవటానికి లోపలికి వెళ్ళాడు!

సరోజకూడా అతడి వెనకాలే వెళ్ళి నెమ్మదిగా ఎందుకిస్తానన్నారండీ! మళ్ళీ ఎప్పుడిస్తుందో ఏమో! అసలేనెలాఖరు రోజులు లేదని చెప్పేనేయలేకపోయారా? అంది.

''చాల్లే వూరుకో! ఆవిడ అంత యిదిగా అడుగుతుంటే యివ్వకపోతే ఏం బాగుం టుంది చెప్పు'' అంటూ డబ్బు తీసికెళ్ళి యివ్వగానే తిరిగి వచ్చేటప్పుడు తప్పకుండా యిస్తానని చెప్పి వెళ్ళిపోయింది.

సరోజకెందుకో మొదటినుంచీ రంగమ్మ గారంటే అంతయిష్టంలేదు. ''ఆమె స్వాభా వం నాకు నచ్చదు'' అంటుంది తప్ప వేరే కారణం ఏదీ చెప్పదు సరోజ. ఏమాట కామాటే చెప్పుకోవాలి తన అయిష్టతనిబయట పెడుతుందే తప్ప జరగకూడదని మొండి పట్టుపట్టటం, జరిగితే గొడవ చేయటం సరోజ స్వభావానికి విరుద్ధం. కాబట్టే తాను వద్దన్నా భర్త రంగమ్మగారికి డబ్బిచ్చినప్పుడు ఏ గొడవాచేయలేదు. చేయదని తెలుసుగాబట్టే రామారావు యివ్వగలిగాడు.

రంగమ్మగారొక వితంతువు. భర్తపోయి చాలాకాలం అయింది. రామారావు పనిచే స్తున్న వూరికి రెండు మైళ్లలో పేట అనే చిన్నపల్లె వుంది. అక్కడ ఆవిడకి పొలా లున్నాయి. కూతురూ, అల్లుడూ చాలా దూరం లోనేవున్నారు. ఈవిడ వాళ్లదగ్గరేవుటూ వుంది. మధ్యమధ్యవచ్చి పొలాలు చూసు కుని, రైతులదగ్గరినుంచి డబ్బు వసూలు చేసుకునిపోతూ వుంటుంది. అక్కడికివచ్చి నప్పుడల్లా రామారావు వుండే యింటావిడ లక్ష్మమ్మగారితో పున్న స్నేహాన్ని పురస్క రించుకొని వాళ్లింట్లో ఓపూట వుండివెడు తుంది. అలా వచ్చినప్పుడే సరోజా రామా రావులకి ఆవిడతో పరిచయం ఏర్పడింది. సహజంగా కలుపుగోలు మనిషి అయిన రంగమ్మగారు వీళ్ళిద్దరిని ఎంతో ఆత్మీయు లుగా భావించేది. వచ్చినప్పుడల్లా వాళ్ల యోగక్షేమాలు కనుక్కొని పోతుండేది. రామారావు కూడా ఆమెపట్ల అదే విధమైన ఆత్మీయతని ప్రదర్శించేవాడు. అయిష్టత ఏర్పడటంతో సరోజమాత్రం ఆవిడతో అంత ఆప్యాయంగా మెలగలేకపోయేది.

ఆ రాత్రి వీలుచూసుకుని ''చూడు సరోజా రంగమ్మగారు మనకు చాలా కాలం నుంచీ తెలుసు. అటువంటి ఆవిడ నోరు తెరిచి అడిగినప్పుడు యివ్వకపోతే ఏం బాగుంటుంది చెప్పు'' అంటూ నచ్చచెప్పటా నికి ప్రయత్నించాడు రామారావు.

'ఆవిడ సంగతి మీకు తెలియదు కావాలంటే మన యింటావిణ్ని అడిగిచూడండి మీకే తెలుస్తుంది'' అంది సరోజ.

'సరేలే యిస్తే యిస్తుంది. లేకపోతేలేదు. ఎవరికన్నా దానం చేశాం అనుకుందాం' అన్నాడు రామారావు.

'అంతేలెండి! అలా అనుకుని తృప్తి పడక యిప్పుడు చేసేదేముంది? ఎవళ్లకి బడితే వాళ్ళకి అడగానే డబ్బివ్వటం మంచిదికాదు. కాస్త మన పరిస్థితినీ, వాళ్ల స్వభావాన్నీ దృష్టిలో పెట్టుకుని వ్యవహరించాలి'' అంటూ కాస్తగట్టిగానే హెచ్చరించింది.

సరోజ అలా హెచ్చరించటంతో రామారావు ఏమీ అనలేక కాస్త యిబ్బందిగా చూశాడు. వెంటనే సరోజ 'ఇప్పుడు నేనేమన్నానని మీరంతా యిదై పోయారు'' అంటూ నవ్వేసింది.

మళ్ళీ రామారావు తాను చేసిన పనిని సమర్థించుకోటానికి ప్రయత్నించబోతూ వుంటే 'మీరు డబ్బు యిచ్చారని నాకేం కోపం రాలేదులెండి ముందు జాగ్రత్తకోసం అన్నాను అంటూ రామారావు దగ్గరకొచ్చి అతని జుట్టులోకి వేళ్లపోనిచ్చి దువ్వుతూ నిబ్బుంది.

''అయితే ప్రస్తుతానికి ధన్యుణ్ని అయ్యానన్నమాట'' అంటూ రామారావు తేలిక పడిన మనసుతో సరోజని దగ్గరికి లాక్కున్నాడు.

పై సంఘటన జరిగిన తర్వాత చాలా కాలానికి ఒకరోజు సాయంత్రం స్కూలు ప్యూను ఎవరో ఒక అపరిచిత వ్యక్తిని వెంట బెట్టుకొనివచ్చి 'ఈయన మిమ్మల్ని కలుసుకోవాలని చెబితే తీసుకొచ్చానండి' అని చెప్పి వెళ్ళిపోయాడు.

రామారావు ఆ వ్యక్తిని పరిశీలనగా చూశాడు. అంతకుముందెప్పుడూ తాను అతన్ని చూసిన గుర్తులేదు.

పనేమిటి' అనడిగాడతణ్ని.

'మాది అసలు మీవూరే. మీ చిన్న తమ్ముడు రంగారావుగారు నాకు బాగా తెలుసు' అన్నాడా వ్యక్తి.

'ఓహో! అలాగా'

'అక్కడ మీరు నన్ను చూసేవుంటారు' ఆశగా చూశాడు అతను రామారావువేపు.

లేదన్నట్లు తలవుపాడు రామారావు.

అతడి ముఖంలో ఆశాభంగం కొట్టవచ్చినట్లు కనిపించింది. 'నేను మాత్రం మిమ్మల్ని చాలాసార్లు చూశానండి' అన్నాడు మళ్ళీ.

'చూస్తే చూసివుండొచ్చు' రామారావు అన్నాడు.

చెప్పనావద్దా అని కాసేపు తటపటాయించి ఆ తర్వాత యిలా చెప్పుకుపోయాడు. 'నేను నాగార్జునసాగర్ సర్వే డిపార్టుమెంటులో పనిచేస్తున్నానండి. మా సర్వే పార్టీ వాళ్ళం కొంతకాలంగా అవూరి చుట్టు ప్రక్కల పని చేస్తున్నాం. పగలంతా ఫీల్డు మీద వుంటాం. రాత్రికిమాత్రం యిక్కడికొచ్చి మునసబుగారింట్లో పడుకుంటాం. మామూలుగా మాకు ప్రతినెలా అయిదో తారీఖువచ్చేటప్పటికి ప్రత్యేక మనిషి ద్వారా జీతాలు అందేట్లు చేస్తారు ఈసారి ఎందుకనో ఆలస్యం అయింది. నేను అర్జంటుగా వూరికెళ్ళాలి. చేతిలో నయాపైసాలేదు ఓ పదిరూపాయలుంటే అప్పుగా యిప్పించండి వూరినుంచి రాగానే యిచ్చేస్తాను''

అతడి మాటల్లోనేగాక ముఖంలో గూడా నిజాయితీ వున్నట్టే కనిపించింది రామారావుకి. సాధారణంగా అతడికి మనుషుల నిజాయితీమీద నమ్మకం ఎక్కువ. కానీ కొంతకాలం క్రితం జరిగిన సంఘటన అతడి నమ్మకాన్ని సవాలుచేస్తున్నట్లు గుర్తుకొచ్చింది.

తిరిగి వచ్చేటప్పుడిస్తానని పాతిక రూపాయలు పట్టుకెళ్ళిన రంగమ్మగారు నెలలు గడిచినా ఆ డబ్బు తిరిగియివ్వలేదు. రెండు మూడుసార్లువచ్చి కూడా డబ్బు సంగతి ఎత్తకుండా పలకరించివెళ్ళిపోయింది. ఆవిడ వచ్చినప్పుడు అడుగుదామనుకుని కూడా మొహమాటం అడ్డురావటంతో మానేశాడు.

ఇలా ఆలోచిస్తున్న రామారావు మౌనం చూసి తనని అనుమానిస్తున్నాడేమో అనుకున్నాడావ్యక్తి కాస్త బాధపడ్డాడు. అలా అని తాను అతణ్ని అడక్కుండా పోతే తనకే నష్టం ప్రయాణం చెయలేకపోవటమే కాకుండా తనకావాత్రి తిండికూడా వుండదు.

ఇలా అనుకుని అతను తన మాటల్లో నిజాయితీ ధ్వనించేటట్లు తన పరిస్థితిని వివరించాడు.

రామారావుకి అతను చెబుతున్నది నిజమేననిపించింది. తనూ తన తమ్ముడూ తెలుసునంటున్నాడు. ఒకవేళ అతను అబద్ధాలు చెబుతున్నాడనే అనుకున్నా దానివల్ల తాను నష్టపడేది ఎంత? ముష్టి పదిరూపాయలు. బాగా తెలిసిన వ్యక్తి ఆస్తిపరురాలూ అని నమ్మి యిచ్చిన పాతికరూపాయలు రంగమ్మగారూ యింతవరకూ యివ్వనేలేదు.

ఈ ఆలోచనరాగానే అంతకుముందున్న కాస్త సంకోచం తొలిగిపోయింది. రామారావుకి. ఒకపక్క సరోజ హెచ్చరిక గుర్తున్నా, అతడి పరిస్థితిని దృష్టిలోవుంచుకుని అతడికి డబ్బిచ్చి పంపించాడు.

ఆ అపరిచిత వ్యక్తికి తానిచ్చిన అప్పు విషయంలో సరోజ ఏమంటుందో అని బాగా మథనపడిన రామారావు ఆ రాత్రి పిలుచూసుకుని ఆ విషయం భార్య చెవినవేశాడు. తానే పరిస్థితిలో అతడికిచ్చింది వివరంగా చెప్పాడు.

భర్త చెప్పింది శ్రద్ధగా విన్న సరోజ "పోనీలెండీ! అవసరంలో వుండి అడిగిన వ్యక్తికి సాయంచేశారు" అంది.

బాగా కోపంవస్తుందేమో ఎలా తట్టుకోవాలా అని భయపడుతున్న రామారావు ఆ మాటలకి ఆశ్చర్యపడ్డాడు. సరోజ మనస్తత్వం అతడికెప్పుడూ ఒక సమస్యగానే వుంటూ వచ్చింది.

"నీది చాలా వింత మనస్తత్వం సరోజా రంగమ్మగారికి డబ్బు యివ్వొద్దన్నావు. ఎవరికోయిస్తే మంచిపని చేశారంటున్నావు. నీ స్వభావంనాకర్థం కావటంలేదు' అన్నాడు.

'ఇందులో వింతగానీ, అర్థంకానిదిగానీ ఏముంది చెప్పండి. కొందరు మనుష్యుల్ని గుడ్డిగా నమ్మితే మరికొందరు అనవసరంగా అనుమానిస్తారు. నేను రెండు పద్ధతుల్ని వ్యతిరేకిస్తాను. వాళ్ల పరిస్థితుల్ని ప్రవర్తనని, పరిశీలించి నమ్మదగ్గ వాళ్లు అవునో కాదో నిర్ణయించుకోవాలిగానీ, డబ్బు హోదా కులం, అందం, వీటినిబట్టి నిర్ణయించేయకూడదు" అంది సరోజ ఖండితంగా.

ఇహ ఆ విషయం మీద సంభాషణని పొడిగించటం యిష్టంలేక మరో అంశం ప్రస్తావించాడు రామారావు.

ఆ తర్వాత రెండురోజులకిస్తాపురాములో కూచోవుంటే ఫ్యూన్‌వచ్చి 'అరోజు నేను మీయింటికి తీసికొచ్చినతను యిందాక మీకు డబ్బుయిద్దామని వచ్చాడండి. మీరప్పుడు క్లాసులోవున్నారు. అతను తొందరగా వెళ్ళిపోవాలిట. అందుకని మీకిమ్మని ఈ డబ్బు నాచేతికి యిచ్చివెళ్ళాడండీ తానే స్వయంగా కలిసియివ్వలేకపోయినందుకు బాధపడుతూ ఏమీ అనుకోవద్దని మిమ్మల్ని కోరానని చెప్పమన్నాడండీ' అంటూ పదిరూపాయలిచ్చి వెళ్ళిపోయాడు.

మౌనంగా ఆ డబ్బు అందుకున్నాడు రామారావు. మొదట్లో తాను అతని నిజాయితీని శంకించినందుకు పశ్చాత్తాపడ్డాడు

ఆ సాయంత్రం సరోజతో ఈ వార్త చెప్పాడు.

'నేనప్పుడే అనుకున్నానుసుమా! ఆ డబ్బు తప్పకుండా త్వరగా వచ్చేస్తుందని అంటూ సరోజగర్వంగా రామారావువేపు చూసి 'మధ్యాహ్నం రంగమ్మగారు వచ్చి ఆ పాతిక రూపాయలూ యిచ్చి వెళ్ళిందండి. 'ఆలస్యం అయింది ఏమీ అనుకోవద్దని అబ్బాయితో చెప్పు' అని కూడా అన్నదండీ'' అంది.

'చూశావా! ఆమెని నువ్వు అనవసరంగా అనుమానించావు' అన్నాడు సరోజవేపు చూస్తూ

'భలే వారే! ఆ డబ్బు అసలే రాదని నేనన్నానా! తొందరగా రాదన్నానుగావీ'' అంటూ జవాబిచ్చింది.

సరోజ మాటల్లోని సామంజస్యాన్ని, గుడ్డిగా నమ్మటం లేక అనుమానించటం అన్న తన లోపాన్ని గుర్తించిన రామారావు తన ఓటమిని అంగీకరించాడు.

తనని సరోజ ఎక్కడ దెప్పిపొడుస్తుందో అనే భయంతో ఆమెకా అవకాశం యివ్వకుండా దగ్గరికి తీసుకున్నాడు. వెంటనే సరోజకూడా అతని రొమ్ముపైవాలిపోయింది.


త్వరలో వెలువడుతోంది

# విరసం త్రైమాసిక

# అరుణతార

నాలుగు సంచికలు పది రూపాయలు

వివరాలకు సంప్రదించండి :

కార్యదర్శి,

విరసం : 10-6-27. కావలి-1